క్లుప్తంగా

వాహన తనిఖీలు



వాహన తనిఖీలు చేస్తున్న పోలీసులు

భామిని: ఆంధ్రా–ఒడిశా సరిహద్దు చెక్‌పోస్టు వద్ద బత్తిలి ఎస్సై చిట్టిపోలు ప్రసాద్ ఆధ్వర్యంలో ఆదివారం ముమ్మరంగా వాహన తనిఖీలు చేపట్టారు. ఒడిశా నుంచి వచ్చిపోయే ప్రతీ వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేశారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో మద్యం, నగదు అక్రమ తరలింపుపై నిఘా పెట్టినట్లు చెప్పారు.

ఆధ్యాత్మిక ప్రచారం



ప్రచారం చేస్తున్న సేవా సమితి సభ్యులు

భామిని: మండలంలోని సతివాడలో త్రైతసిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం ఆధ్యాత్మిక ప్రచారం చేపట్టారు. ఫాల్గుణ పౌర్ణమిని పురస్కరించుకుని నిర్వహించే హోళీ పండగ విశిష్టతను ప్రజలకు వివరించారు. హోళీ రోజు జల్లుకునే రంగులు మన గుణాలకు గుర్తింపుగా ఉంటాయన్నారు. అనంతరం త్రైతసిద్ధాంత భగవద్గీత, అనుబంధ గ్రంథాలపై ప్రచారం చేపట్టారు.

కోడ్ అమలులో నిర్లక్ష్యం వద్దు



కొత్తపల్లిలో పర్యటిస్తున్న ఎంపీడీఓ సూర్యనారాయణ, తదితరులు

గరుగుబిల్లి: ఎన్నికల ప్రవర్తనా నియమావళి అతిక్రమిస్తే చర్యలు తప్పవని ఎంపీడీఓ పి.సూర్యనారాయణ అన్నారు. మండలంలోని కొత్తపల్లి, రావుపల్లి గ్రామాల్లో ఆదివారం ఎన్నికల సర్వైలెన్స్ సిబ్బందితో కలిసి పర్యటించారు. ఎన్నికల కోడ్‌పై ప్రజలకు అవగాహన కల్పించారు. ఎక్కడైనా రాజకీయ పార్టీలకు సంబంధించిన పోస్టర్లు, బ్యానర్లు, ఫ్లెక్సీలు ఉంటే వెంటనే తొలగించాలని గ్రామస్థాయి అధికారులను ఆదేశించారు. ఎన్నికల కోడ్ అమలులో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు.

వైద్య పరీక్షలు వినియోగించుకోవాలి



పీహెచ్‌సీ ల్యాబ్‌లో రోగనిర్ధారణ పరీక్షలు చేస్తున్న టెక్నీషియన్

సీతానగరం: మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో ప్రజలకు మెరుగైన వైద్యసేవలందించడానికి, వ్యాధి నిర్ధారణకు అవసరమైన పరికరాలు, మందులు సిద్ధంగా ఉన్నందున ప్రజలు వినియోగించుకోవాలని డాక్టర్ బి.పావని, సీహెచ్‌ఓ ఎస్వీ రమణ కోరారు. ఈ మేరకు ఆదివారం వారు మాట్లాడుతూ పీహెచ్‌సీలో ల్యాబ్ నిర్వహించడానికి అవసరమైన పరికరాలు ప్రభుత్వం సమకూర్చడం వల్ల రోగులకు బహుళ ప్రయోజనాలు ఉన్నాయని, రోగ నిర్ధారణకు ప్రైవేట్ ల్యాబ్‌లకు వెళ్లవలసిన అవసరం లేదన్నారు. ఆరోగ్య సురక్ష పథకం ద్వారా గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహించే సమయంలో స్పెషలిస్ట్ డాక్టర్ల సిఫారసు మేరకు స్థానికంగా ల్యాబ్ టెక్నీషి యన్ ఇక్కడి ల్యాబ్‌లో 14 రకాల వైద్య పరీక్షలు నిర్వహిస్తూ 15 రోజులకు అవసరమైన మందులు పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వ వైద్య సేవలను ప్రజలు వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు.

ముగిసిన గీతా మహాయజ్ఞం



శ్రీకృష్ణ విశ్వశాంతి కల్యాణంలో పాల్గొన్న దంపతులు

పార్వతీపురం: మండలంలోని చినబొండపల్లి గ్రామంలో శ్రీజగన్మాత ఈశ్వరీ మహదేవీ పీఠంలో గీతా మహాయజ్ఞం ఆదివారం ముగిసింది. ఈ మేరకు ముగింపు సందర్భంగా కృష్ణ విశ్వశాంతి కల్యాణాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శ్రీకృష్ణ విశ్వశాంతి గీతా మహాయజ్ఞంలో భాగంగా గడిచిన 40 రోజులుగా గీతా పారాయణం చేస్తూ తాత్పర్యాలను వివరించారు. పీఠాధిపతులు సద్గురు శ్రీనివాస స్వాములు ఆధ్వర్యంలో ప్రతిరోజూ భగవద్గీతలోని 18 అధ్యాయాలను పారాయణం చేసి ప్రతి శ్లోకానికి హోమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గీతాయజ్ఞం చేయడంవల్ల విశ్వశాంతి, సమాజశాంతి కలుగుతుందన్నారు.


బిత్రపాడులో అభివృద్ధి బాట

- సీసీరోడ్లు, డ్రైనేజీలు, తాగునీటి ట్యాంకుల ఏర్పాటు
- సచివాలయం, ఆర్‌బీకే, వెల్‌నెస్ కేంద్రం ఏర్పాటుతో ఇంటి వద్దకే ప్రభుత్వ సేవలు

జియ్యమ్మవలస: మండలంలోని బిత్రపాడు సచివాలయం పరిధిలోని బిత్రపాడు, బట్లభద్ర గ్రామాల్లో సంక్షేమ ఫలాలు కళ్లకుకట్టినట్లు కనిపిస్తున్నాయి. గత ప్రభుత్వం గిరిజన గ్రామాల్లో కనీస వసతులు కల్పించకపోవడంతో ఇక్కడి ప్రజలు అనేక అవస్థలు పడేవారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏజెన్సీ ప్రాంతాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించి గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు పెద్ద మొత్తంలో నిధులు కేటాయించింది. ప్రభుత్వం అందించిన నిధులతో స్థానిక సర్పంచ్ గుంట్రెడ్డి శ్రీనివాసరావు గ్రామస్తుల అవసరాలకు అనుగుణంగా రోడ్లు, కాలువలు, మినీ రక్షిత మంచినీటి పథకాలను ఏర్పాటు చేశారు. నాడు–నేడు కింద పాఠశాలలో ప్రహరీ నిర్మాణంతో పాటు విద్యార్థులకు అవసరమైన అన్ని వసతులు కల్పించారు. గ్రామ సచివాలయం, రైతుభరోసా కేంద్రం, హెల్త్ వెల్‌నెస్ కేంద్రాన్ని నిర్మించి ప్రభుత్వ సేవలను ప్రజలకు చేరువ చేశారు. ప్రభుత్వం అందించిన ప్రతీ రూపాయిని సద్వినియోగం చేసుకుని గ్రామాభివృద్ధికి బాటలు వేశారు. అలాగే వివిధ సంక్షేమ పథకాల ద్వారా గ్రామంలోని అర్హులైన 3,568 మందికి రూ.14.02 కోట్లు లబ్ధి జరిగింది. గ్రామంలో మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉండటం, ప్రజల ఆర్థిక పరిస్థితి మెరుగుపడటంతో ప్రతి ఇంటా సంతోషాలు నెలకొన్నాయి.



తాగునీటి పథకం



నాడు-నేడు పథకం కింద అభివృద్ధి చేసిన పాఠశాల



బిత్రపాడు గ్రామ సచివాలయం



బిత్రపాడు గ్రామం

ప్రతీ రూపాయి సద్వినియోగం



గ్రామాన్ని అభివృద్ధి చేయాలనే ఆలోచనతో సర్పంచ్‌గా పోటీ చేశాను. పంచాయతీకి ప్రభుత్వం ఇచ్చిన ప్రతీ రూపాయిని సద్వినియోగం చేసుకుని గ్రామంలో అభివృద్ధి పనులు చేపట్టాం. ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలు గ్రామంలోని ప్రతీ కుటుంబానికి అందేలా చూశాను.

– గుంట్రెడ్డి శ్రీనివాసరావు, బిత్రపాడు సర్పంచ్

తాగునీటికి ఇబ్బంది లేదు



గతంలో గ్రామంలో తాగునీటి సమస్య ఉండేది. బిందెడు నీటి కోసం ఇబ్బంది పడాల్సి వచ్చేది. రక్షిత మంచినీటి పథకం ఏర్పాటుతో తాగునీటి ఇబ్బందులు తప్పాయి. గ్రామంలోనే అత్యవసర వైద్య సేవలు అందుతున్నాయి. ప్రైవేటు పాఠశాల మాదిరిగా గ్రామంలోని పాఠశాలను తీర్చిదిద్దారు. వీధి లైట్లు, సీసీరోడ్లు అన్నీ ఉన్నాయి.

– కొప్పర ఆదినారాయణ, బిత్రపాడు

నేటి నుంచి డోలోత్సవం

భామిని: మండలంలోని లివిరి గ్రామంలో వెలసిన గోపీనాథ రాధాకృష్ణ ఆలయంలో డోలోత్సవం నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఆదివారం రాత్రి లివిరిలో మగా కాల్చి ఉత్సవాలు ప్రారంభించారు. నేటి నుంచి వచ్చే నెల 4 వరకు ఉత్సవాలు కొనసాగుతాయన్నారు. ఆలయాన్ని సుందరంగా అలంకరించారు. ఆలయానికి వెళ్లే మార్గంలో సింహద్వారాన్ని ఏర్పాటు చేశారు. ఆంధ్రా–ఒడిశా ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు తరలిరానున్నందున వారికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు.

- కురుపాం: మండల కేంద్రంలోని శివ్వన్నపేట జగన్నాథస్వామి ఆలయ ఆవరణలో నేటి నుంచి డోలాయాత్ర నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. రెండు రోజుల పాటు నిర్వహించే ఈ ఉత్సవంలో భాగంగా జగన్నాథస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు చెప్పారు.



కురుపాం: శివ్వన్నపేటలో వెలసిన జగన్నాథస్వామి



భామిని: డోలోత్సవాలకు ముస్తాబైన గోపీనాథ ఆలయం

హద్దు మీరితే చర్యలు తప్పవు

పాలకొండ రూరల్: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పాత నేరస్తులు అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడినా, హద్దు మీరి ప్రవర్తించినా చట్ట ప్రకారం కఠిన చర్యలు తప్పవని సీఐ ఎం.చంద్రమౌళి హెచ్చరించారు. వివిధ కేసులతో ప్రత్యక్షంగా, పరోక్షంగా సంబంధం ఉన్న వారిని ఆదివారం స్థానిక పోలీస్ స్టేషన్‌కు పిలిపించి మాట్లాడారు. ఎన్నికల ప్రవర్తన నియమావళిపై అవగాహన కల్పించారు. పాత నేరస్తులపై నిఘా ఏర్పాటు చేసినట్లు చెప్పారు. నిబంధనలకు వ్యతిరేకంగా వ్యవహరించేవారిపై ఉపేక్షించేది లేదన్నారు. ఎస్సై ఎస్.ప్రశాంత్‌కుమార్, సిబ్బంది ఉన్నారు.

వైభవంగా సీతారామ ఆలయ పునఃప్రతిష్ట



పూజా కార్యక్రమంలో పాల్గొన్న డిప్యూటీ సీఎం రాజన్నదొర



పూజా కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి దంపతులు

గరుగుబిల్లి: మండలంలోని రావుపల్లిలో సీతారామ మందిర పునఃప్రతిష్ట ఉత్సవాలు వైభవంగా జరిగాయి. ఆదివారం నిర్వహించిన పూజా కార్యక్రమాల్లో డిప్యూటీ సీఎం, గిరిజన సంక్షేమశాఖ మంత్రి పీడిక రాజన్నదొర, కురుపాం ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్‌రాజు పాల్గొని పూజలు చేశారు. ఈ సందర్భంగా గ్రామ కమిటీ సభ్యులు డిప్యూటీ సీఎంను ఘనంగా సత్కరించారు.

అనంతరం కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. బొబ్బిలి ఎమ్మెల్యే శంబంగి చినఅప్పలనాయుడు, ఎంపీపీ ఉరిటి రామారావు, సర్పంచ్ బి.మహేశ్వరరావు, మాజీ సర్పంచ్ జి.కాశీనాయుడు, మాజీ ఎంపీటీసీ జి.అన్నపూర్ణమ్మ, బోను వాగ్దేవి, జి.శంకరరావు తదితరులు పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

సమయపాలన తప్పనిసరి

గరుగుబిల్లి: వైద్య ఆరోగ్య సిబ్బంది సమయపాలన పాటించాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ బి.జగన్నాథరావు అన్నారు. మండల కేంద్రంలోని పీహెచ్‌సీని ఆదివారం ఆయన సందర్శించారు. ఓపీ, ఐపీ, మందుల నిల్వలకు సంబంధించిన రికార్డులను తనిఖీ చేశారు. రోగులకు నిరంతరం అందుబాటులో ఉంటూ మెరుగైన వైద్య సేవలందించాలని సిబ్బందికి సూచించారు. గ్రామాల్లో ఫీవర్ సర్వేలు చేపట్టాలని, అవసరమైన చోట వైద్యశిబిరాలు ఏర్పాటు చేయాలన్నారు. వ్యాధుల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించాలని సూచించారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించే సిబ్బందిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట డాక్టర్ కేకే సాగర్‌వర్మ, తదితరులున్నారు.



రికార్డులను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ జగన్నాథరావు

సాయుధ బలగాల కవాతు

భామిని: మండలంలోని కొరమ, కీసర, కోసలి గ్రామాల్లో ఆదివారం సాయుధ బలగాలు ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. బత్తిలి ఎస్సై చిట్టిపోలు ప్రసాద్ ఆధ్వర్యంలో గ్రామాల్లో కవాతు నిర్వహించి ఓటు హక్కు వినియోగంపై ప్రజలను చైతన్యం చేశారు. ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలని సూచించారు. ప్రశాంత ఎన్నికల నిర్వహణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు.



కొరమలో కవాతు చేస్తున్న సాయుధ బలగాలు

జీడి పిక్కల కొనుగోలు ప్రారంభం

గుమ్మలక్ష్మీపురం: మన్యంలో జీడి పిక్కల కొనుగోళ్ల ప్రక్రియ ప్రారంభమైంది. ఇప్పుడిప్పుడే జీడి పిక్కల దిగుబడి వస్తోంది. వాటిని సేకరించే పనిలో జీడి రైతులు నిమగ్నమయ్యారు. ప్రస్తుతం కిలో జీడి పిక్కలను రూ.108లకు వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు. పూత, పిందె బాగున్నా.. ఆశించిన దిగుబడి మాత్రం రాలేదని రైతులు వాపోతున్నారు.



తోలుఖర్జ సమీపంలో జీడిపిక్కలు సేకరిస్తున్న రైతులు

ప్రకృతి సాగు విధానం ప్రోత్సహించేలా..

గరుగుబిల్లి: ప్రకృతి వ్యవసాయ విధానాన్ని ప్రోత్సహించేందుకు జట్టు సంస్థ చర్యలు చేపట్టినట్లు ట్రస్టీ డి.పారినాయుడు తెలిపారు. మండలంలోని తోటపల్లి ప్రకృతి అతిథిదేవోభవ ప్రాంగణంలో ఆదివారం రచయితలతో వర్క్‌షాపు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రకృతి వ్యవసాయ విధానం ఆవశ్యకతను విద్యార్థులు తెలుసుకునేలా అభినయ గీతాలను రూపొందించినట్లు చెప్పారు. విద్యార్థులు ఆలపించిన గీతాలను రికార్డు చేసి గ్రామాల్లో రైతులకు వాటిని వినిపించడం ద్వారా ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో కన్సల్టెంట్ టి.శివాజీ, పి.రవీంద్రనాద్, పార్వతీపురం కేపీఎం పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

వీరఘట్టం: స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో సోమవారం ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ బాలాజీ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్‌కు కొత్తగా వచ్చిన పవర్ ట్రాన్స్‌ఫార్మర్ పనులు చేపడుతున్నందున స్టేషన్ పరిధిలోని వీరఘట్టం, నడుకూరు, విక్రమపురం, నడిమికెల్ల, కంబర, కిమ్మి, చిట్టపులివలస, కంబరవలస, కొట్టుగుమ్మడ, గడగమ్మ, చలివేంద్రి, దశుమంతపురం, సంత–నర్సిపురం, చిదిమి, పాలమెట్ట, రేగులపాడు, హుస్సేనుపురం, కత్తులకవిటి పంచాయతీలకు విద్యుత్ అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు.

సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక నిఘా

పాలకొండ: ప్రశాంత ఎన్నికల నిర్వహణే లక్ష్యంగా డివిజన్‌లోని సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక గ్రామాలపై ఎన్నికల యంత్రాంగం దృష్టి సారించింది. ఎన్నికల నేపథ్యంలో గ్రామాల్లో అలజడులు సృష్టించేందుకు ప్రయత్నించేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ జీవీ కృష్ణారావు తెలిపారు. మండలంలోని సమస్యాత్మక గ్రామమైన టీడీ పారాపురం పోలింగ్ స్టేషన్‌ను ఆదివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాలకొండ డివిజన్‌లో 31 సమస్యాత్మక, 12 అతి సమస్యాత్మక గ్రామాలను గుర్తించినట్లు చెప్పారు. ఆయా గ్రామాల్లో ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు. గ్రామాల్లో నిఘా పెంచినట్లు చెప్పారు. గొడవలు సృష్టించాలని చూసేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఆయన వెంట సీఐ చంద్రమౌళి ఉన్నారు.



టీడీ పారాపురం పోలింగ్ స్టేషన్‌ను పరిశీలిస్తున్న డీఎస్పీ, సీఐ

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక



హాజరైన పూర్వ విద్యార్థులు

గరుగుబిల్లి: మండలంలోని తోటపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఆదివారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. పాఠశాలలో 2009–10 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న వారంతా సమావేశమయ్యారు. ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకుని యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. నాటి మధుర జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. వివిధ ఉద్యోగాల్లో స్థిరపడినవారంతా తమ అనుభవాలను పంచుకున్నారు. అనంతరం ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో విశ్రాంత ఎంఈఓ ఎస్.చంద్రశేఖరరావు, ఉపాధ్యాయులు చంద్రశేఖర్, కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

రహదారికి మోక్షం



కాకితాడ నుంచి సంజువాయి గిరిజన గ్రామానికి వెళ్లే రహదారి



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రూ.1.20 కోట్లతో నిర్మించిన బీటీరోడ్డు

కురుపాం: టీడీపీ పాలనలో అధ్వానంగా ఉన్న గ్రామీణ రహదారులు నేడు కొత్తరూపు సంతరించుకున్నాయి. గ్రామీణ రహదారుల అభివృద్ధికి ప్రభుత్వం భారీగా నిధులు కేటాయించడంతో పనులు వేగవంతం అయ్యాయి. మండలంలోని ఉదయపురం పంచాయతీ కాకితాడ గిరిజన గ్రామం నుంచి సంజువాయి గ్రామానికి వెళ్లే దారి అధ్వానంగా ఉండటంతో రాకపోకలకు ప్రజలు ఇబ్బందులు పడేవారు. రోడ్డు వేయాలని గత పాలకులను ఎన్నిసార్లు కోరినా వారి నుంచి స్పందన లేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక సమస్యను ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి దృష్టికి తీసుకువెళ్లగా.. ఆమె వెంటనే స్పందించి ప్రభుత్వం నుంచి రూ.1.20 కోట్లు మంజూరు చేయించారు. ఆ నిధులతో కాకితాడ నుంచి సంజువాయి వరకు బీటీరోడ్డు నిర్మించారు. ప్రయాణ కష్టాలు తీరడంతో గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

కొమరాడ: స్థానిక కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో 2024–25 విద్యా సంవత్సరానికి గాను 6వ తరగతి, ఇంటర్మీడియట్‌లో ప్రవేశాలకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ జి.అరుణకుమారి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పూర్తి వివరాల కోసం కేజీబీవీలో సంప్రదించాలని కోరారు.

ఘనంగా మట్టల ఆదివారం

క్రీస్తు విశ్వాసకులు మట్టల పండగను ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. పూలతో అలంకరించిన ఈత మట్టలను పట్టుకుని వీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. ఏసుప్రభువును స్తుతిస్తూ కీర్తనలు ఆలపించారు. మట్టల పండగ విశిష్టతను పాస్టర్లు తెలియజేశారు. ఏసుక్రీస్తు గుడ్‌ఫ్రైడే రోజున శిలువ యాగం కోసం జెరూసలేం వచ్చినప్పుడు అక్కడి ప్రజలంతా నూతన వస్త్రాలు, కర్జూరపు మట్టలతో దారిపొడుగునా ఆయనకు జేజేలు పలికారని, నాటి నుంచి ప్రపంచ వ్యాప్తంగా క్రైస్తవులు గుడ్‌ఫ్రైడేకు ముందు వచ్చే ఆదివారాన్ని మట్టల ఆదివారంగా జరుపుకుంటున్నట్లు క్రీస్తు విశ్వాసకులు తెలిపారు.

– సాక్షి పాలకొండ, కురుపాం



భామిని: బత్తిలిలో మట్టల పండగ పాల్గొన్న క్రైస్తవులు



గుమ్మలక్ష్మీపురం: ఎస్‌కేపాడు గ్రామంలోని పునీత రాయప్ప ఆలయం వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న మత పెద్దలు



భామిని: తిరువీధిలో పాల్గొన్న క్రీస్తు విశ్వాసకులు



సీతంపేట: కీర్తనలు ఆలపిస్తూ ఊరేగింపుగా వెళ్తున్న క్రైస్తవులు



వీరఘట్టం: మట్టలతో ర్యాలీ చేస్తున్న చిన్నారులు